క్లుప్తంగా

రైతు ధర్నాను జయప్రదం చేయాలి



ప్రచారం నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

మధిర: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అనుబంధ రైతు సంఘం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం మధిర మండల అధ్యక్షుడు పంగా శేష గిరిరావు కోరారు. ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మడుపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో దశరధయ్య, మల్లవరపు గోపి, వెంకటేశ్వర్లు, బండి రామయ్య, సత్యనారాయణ, హనుమంతరావు, రామారావు, మంగయ్య పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న గోవా ఎమ్మెల్యే జయప్రకాశ్

వైరా: అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేసి వైరా నియోజకవర్గంలో బీజేపీ గెలుపుకు కృషి చేయాలని గోవా రాష్ట్ర శాసన సభ్యుడు కేధార్ జయప్రకాశ్ సూచించారు. వైరా నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం వైరాలో నిర్వహించిన వైరా నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు శ్యాం రాథోడ్, బీపీనాయక్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా కరాటే పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

సత్తుపల్లి టౌన్: వచ్చే నెల 9, 10వ తేదీల్లో త్రివేండ్రంలో జరిగే సౌత్ ఇండియా కరాటే పోటీలకు సత్తుపల్లికు చెందిన విద్యార్థులు ఎంపికై నట్లు జిల్లా కరాటే కార్యదర్శి పిచ్చయ్య తెలిపారు. పదేళ్లలోపు కటా విభాగానికి బొర్రా మన్విత్, 11ఏళ్లలోపు విభాగానికి శాలినీ, విశిష్ట, భవ్యశ్రీ, ప్రవీణ్ కుమార్, శైలజ, మణీరత్నం ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ఈ పోటీలు వరల్డ్ కరాటే ఫెడరేషన్ వారిచే గుర్తింపు పొందిన కరాటే ఇండియా ఆర్గనేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సైగా ఎంపికైన యువతికి సన్మానం



హరితను సన్మానిస్తున్న ఎస్సై రామారావు

కారేపల్లి: మండలంలోని టీకులగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి హరిత ఇటీవల వెలువడిన ఎస్సై పరీక్ష ఫలితాల్లో విజేతగా నిలిచి సివిల్ ఎస్సైగా ఎంపికైంది. ఆదివారం కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు.. గుమ్మడి హరితను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ఆదివాసీ గ్రామానికి చెందిన హరిత పట్టుదలతో చదివి, తాను కలలు గన్న ఎస్సై పోస్టును సాధించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సందీప్, పాపయ్యపాల్గొన్నారు.

కొండబాల నివాళి..

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న 6వ వార్డు సభ్యులు తూములూరి జ్యోతి భర్త శ్రీనివాసరావు(50) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, గ్రామసర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ సభ్యులు భారతమ్మ, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు రమేష్, రైతుబంధు సమితి గ్రామ కన్వీనర్ సైదేశ్వరరావు, తదితరులు సందర్శించి నివాళులర్పించి మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఊరించి.. ఉసూరుమనిపించి

- వర్షాలు లేక వడలిపోతున్న పొలాలు
- అదపాదడపా వానలతో రైతుల ఇబ్బందులు
- భారంగా మారిన సాగు.. సగానికి పైగా పెగలని పత్తి
- సాగర్ నీరు వదలాలని రైతుల వేడుకోలు



అమ్మపేటలో.. ఎదగని పత్తి మొక్కలు



పమ్మి వద్ద విద్యుత్ మోటారుతో పత్తి పంటకు నీరు కట్టిన దృశ్యం

ముదిగొండ: ఈ ఏడాది ముందస్తుగానే వర్షాలు కురుస్తాయని అనుకున్న సమయంలో.. సాగు భారంగా మారింది. అడపాదడపా అక్కడక్కడ పడిన వర్షాలే తప్ప సరైన వర్షాలు లేక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు, మూడు నెలల నుంచి పత్తి మొక్కలు పైకి పెగలక పోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇతర జిల్లాల్లో, రాష్ట్రాల్లో సమృద్ధిగా భారీగా కురిసిన వర్షాల వల్ల, మున్నేరులు, వాగులు, చెరువులు లోతట్టు ప్రాంతాలు పొంగుపొర్లాయి తప్ప, సాగుకు అనుకూలంగా వర్షాలు కురవకపోవడంతో రైతన్నలకు పెట్టుబడుల భారంతో ముందుకు సాగలేకపోతున్నారు.

విద్యుత్ మోటార్లపైనే ఆధారం..

చెరువుల్లో, బావుల్లో నీరున్నప్పటికీ విద్యుత్ మోటార్లతోనే పత్తికి నీరందించి సాగు చేపడుతున్నారు. ఈ ఏడాది రెండు నెలల ఆలస్యంగా సాగుచేపట్టిన రైతుకు వర్షాలకు కూడా సమృద్ధిగా లేక ఏమీ చేయాలో పాలుపోవడంలేదని వాపోతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దుక్కి దున్ని, విత్తనాలు వేసి ఎదురు చూస్తున్న సమయంలో పత్తిభూమిపై పెగలకపోవడంతో మోటార్లతో సాళ్లల్లో నీరు కడుతున్నారు.

పెట్టుబడులు కూడా రానట్టే..

అడపాదడపా వచ్చి పోయే జల్లులతో పత్తిలో పెరిగిన కలుపును కూలీలలతో తీయించడానికే సగం డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయానికి పూత, కాతతో పచ్చని పైర్లతో నిగనిగలాడేవిధంగా ఉండాల్సిన సాగు పొలాలు సరైనా వర్షాలు లేక నివ్వెర పోతున్నాయి. పెట్టిన పెట్టుబడులు అయినా చేతికందేనా అన్న విధంగా ఉందని రైతన్నలు దిగాలు చెందుతున్నారు.

మండలంలో సాగు వివరాలు..

ముదిగొండ మండలంలో 13,825మంది రైతులు వివిధ పంటలను సాగు చేపడుతున్నారు. పత్తి11469 ఎకరాల్లో, వరి2769 ఎకరాల్లో, పెసర 213ఎకరాల్లో, మొక్కజొన్న 83ఎకరాల్లో సాగుచేపట్టనున్నారు. వరినారులు పోసుకుని సిద్ధంగా ఉన్నారు. పచ్చిరొట్ట ఎరువులు ఎదిగిపోతున్నాయి. మే, జూన్ నెల నుంచి పత్తికి అనుకూలంగా లేకపోవడంతో కొంతమంది ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించారు. మరికొంతమంది రైతులు కూరగాయలు పండిస్తున్నారు.

ఇప్పటివరకు సరైన వానలే లేవు..



గత రెండు, మూడు నెలల నుంచి సరైన వానలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. పత్తిగింజలు రెండు మార్లు విత్తాం, అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు కొద్దిగా పెలిగింది. ఈ పాటికి కాత, పూతమీద ఉండాల్సిన పత్తి పొలాలు నేల మట్టం నుంచి పైకి ఎదగలేదు. 20ఎకరాల్లో పత్తి సాగుచేపట్టాను ఇంత వరకు మొక్క ఎదగలేదు. మొక్కజొన్న వేసేందుకు సన్నద్ధం చేసుకుంటున్నాం. మోటార్లతో ఎంత నీరు కట్టిన పైనుంచి వచ్చిపోయే వర్షాలకు మాత్రమే పంటలకు అనుకూలం.

– వల్లబి రవికిరణ్, రైతు, అమ్మపేట

పత్తిసాగును దున్ని పెసర వేశాం..



ఐదు ఎకరాల్లో పత్తి.. సాగు చేద్దామని దుక్కులు దున్ని పత్తి విత్తాను, సరైన వర్షాలు లేక మూడు నెలలైనా మొక్క ఎదగలేదు. వెంటనే దున్నేసి పెరస చల్లాం. పెట్టిన పెట్టుబడులు వస్తాయో రావో తెలియక తికమక పడుతున్నాం. వరి పంట, మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు వేసుకోవడమే అనుకూలంగా ఉంది. ఆరుగాలం కష్టపడి, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక, గత ఏడాది పత్తి ఇంకా ఇంటిలోనే పెట్టిన, ఈ ఏడాది కాస్తా సాగు వెనుకబడింది.

– ఏలూరి హనుమంతరావు, రైతు, పమ్మి

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే



మాట్లాడుతున్న మాలోత్ రాందాస్ నాయక్

కారేపల్లి: తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారని, మోసపూరిత పథకాలతో తెలంగాణ ప్రజలను మబ్బె పెట్టారని టీపీసీసీ సభ్యుడు, వైరా నియోజక వర్గ నాయకుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ఆదివారం కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో రాజీవ్ గాంధీ జన్మదినం సందర్భంగా..ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి ప్రతి ఒక్కరికీ వర్తింపజేసి సాయం కింద రూ.5 లక్షలు అందించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని, రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు హీరాలాల్, మేదరి టోనీ, షేక్ మజీద్ పాషా, సపావట్ నాగులు, అజ్మీర సురేష్, కేలోతు శ్రీను, షేక్ జానీ, తోటకూరి రాంబాబు, షేక్ తాజుద్దీన్, హచ్చు, రాంజీ, మంగీలాల్, షబ్బీర్, కిలారు అప్పారావు, కేలోతు బాలు, మేదరి బాలు, సాయి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తున్న మట్టా దయానంద్

తల్లాడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. ఆదివారం మండలంలోని గోపాలపేట, నరసింహారావుపేట, అన్నారుగూడెం, తల్లాడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలందరికీ, పొలాల్లోని కూలీలకు కాంగ్రెస్ డిక్లరేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రూ.5 వేలు ఆసరా పెన్షన్ పథకం, పక్కా గృహాలు వంటివి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు భూక్యా శివకుమార్, అర్వపల్లి సందీప్ గౌడ్, మార్రెళ్ల మల్లిఖార్జున్, జోసఫ్, పొన్నం కృష్ణయ్య, వడ్డే రామారావు, ఎస్.మోహన్‌రావు, కూచిపూడి వెంకటేశ్వర్లు, చల్లగుల్ల కృష్ణయ్య, కటికి కిరణ్, దగ్గుల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూటికుంట్లలో వైద్యశిబిరం



హెల్త్‌కార్డులు అందజేస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని తూటికుంట్ల గ్రామంలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ రిపోర్ట్‌ను సర్పంచ్ వెంకట నర్సమ్మ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కంకణాల సౌభాగ్యం మాట్లాడారు. ప్రభుత్వం లేబర్ ఇన్సూరెన్స్ కింద ప్రతి ఒక్కరికీ 50 రకాల పరిక్షలు నిర్వహించి వారికి హెల్త్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయికిరణ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి రూ.52 వేలు ఆర్థిక సాయం



లావణ్యకు నగదు అందిస్తున్న శ్రీనివాస్

మధిర: మండలంలోని ఖమ్మంపాడు గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని సామినేని లావణ్య ఉన్నత విద్య కోసం ఉపాధ్యాయుడు చేడే శ్రీనివాస్ మిత్ర బృందం ఆర్థిక సాయం అందించారు. ఆమె వైజాగ్‌లో రఘు ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆమె ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో గత సంవత్సరం లాగానే ఈ సారికూడా రూ.52 వేలు అందించారు.

దుస్తులు పంపిణీ..

మధిర: దాతల నుంచి సేకరించిన పాత, నూతన దుస్తులను సమాజ సేవకులు లంకా కొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు పంపిణీ చేశారు. స్థానిక ఆజాద్ రోడ్డులో లంకా కొండయ్య తన నివాసంలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంక్ నుంచి ఆదివారం యాచకులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు అంజి, గోపి, శ్యామ్, పండు, వెంకి పాల్గొన్నారు.

బోనకల్‌కు సినీ ఆర్టిస్టులు..

బోనకల్: సినీ ఆర్టిస్టులు పృథ్వీరాజ్ ,క్రాంతి, శీలాలు ఆదివారం బోనకల్ వచ్చారు. సూర్యపేట జిల్లాలోని బాల నరసింహస్వామి ఆలయ దర్శనానికి వెళ్లి వస్తూ మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ ఇంటి వద్ద కొద్దిసేపు ఉన్నారు. కొత్త రంగుల ప్రపంచం హీరో క్రాంతి, హీరోయిన్ శీలా, పృథ్వీలు మూవీ విశేషాలను అభిమానులతో పంచుకున్నారు. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీనివాసరావు, గోంగూర శ్రీనివాసరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, తాళ్లూరి డేవిడ్ తదితరులు వారిని సన్మానించారు.

చర్యలు తీసుకోవాలి



కొణిజర్ల: పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మదన్‌లాల్ వర్గీయులు

కొణిజర్ల/ఏన్కూరు/కారేపల్లి: వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మదన్‌లాల్ వర్గీయులు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దశా కమిటీ సభ్యుడు బాదావత్ బాలాజీ, బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రావు, ఎంపీటీసీ వాసిరెడ్డి వెంకటేశ్వరావు, నవీన్, నాగరాజు, జెడ్పీటీసీ జగన్‌నాయక్, గౌసుద్దీన్, సామేల్, ఖలీలుల్లా ఖాన్, వెంకట్, వికాస్, కళ్యాణ్, కిరణ్, బుజ్జి, రామారావు, మన్మధరావు, వికాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ జ్ఞాపకాలు పదిలం



సత్తుపల్లిటౌన్: గద్దర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తుపల్లి టౌన్: విప్లవ గీతం ఉన్నంత వరకు ప్రజానౌక గద్దర్ జ్ఞాపకాలు ప్రజల మనసుల్లో పదిలంగా ఉంటాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవలె మృతి చెందిన గద్దర్ సంస్మరణ సభ సమావేశాన్ని ఆదివారం తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో సత్తుపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోకలకుంట రవి, చిత్తలూరి ప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోటూరి మానవతరాయ్, వివిధ పార్టీల నాయకులు గంటా శ్రీను, మోరంపూడి పాండు, దండు ఆదినారాయణ, కొత్తూరు ప్రభాకరరావు, రంగపూరి వెంకటేశ్వరరావు, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, డి మధుసూధన్‌రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

గద్దర్, అలీఖాన్ సంస్మరణ సభ..

కారేపల్లి: మండలంలోని కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్, లౌకిక ప్రజాస్వామిక వాది జహీర్ అలీఖాన్‌ల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కళాకారులు ఆదెర్ల శంకర్, నాగేంద్రబాబు, నారాయణలు తమ ఆటపాటలతో అలరించారు. నాగేశ్వరరావు, ప్రకాశ్, రామస్వామి, శ్రీనివాసరావు, చంద్రప్రకాశ్, వెంకటేశ్వర్లు, మంజుల, సురేందర్ మనియార్, రాములు, సుజాత, జానకి, పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు అండగా ఉంటా



సత్తుపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: ఫొటోగ్రాఫర్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. స్థానిక మాదురి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఫొటో గ్రాఫర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్ల సంక్షేమ భవనం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఫొటో గ్రాఫర్లు ఎమ్మెల్యే సండ్రను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, వేమూరి నాగరాజు, వేముల నరసింహారావు, నాగేశ్వరరావు, హరి, వెంకటేశ్వరరావు, రాఘవచారి, రాము, పాషా, కనకరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సండ్ర పరామర్శ..

తల్లాడ: మండలంలోని తెలగవరం, అంజనాపురం, గొల్లగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను పరామర్శించి వారి బాగోగులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, నాయకులు మువ్వా మురళీధర్‌రావు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, కృష్ణయ్య, చలపతిరావు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్'ను ఆదరించండి



పార్టీలో చేరిన వారితో లింగాల, కొండబాల

బోనకల్: రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న బీఆర్ఎస్‌ను ఆదరించాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని జానకీపురం గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నుంచి 120 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అబివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీను, చేబ్రోలు మల్లిఖార్జున్, బానోత్ కొండ, కరివేద సుదాకర్, గద్దల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కమల్‌రాజ్ పరామర్శ..

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో అనారోగ్యంతో బాదటపడుతున్న చింతకాని సొసైటీ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నన్నక కోటయ్య, మంకెన సీతారామయ్య లను జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీసర్పంచ్ కిలారు సూర్యప్రకాశ్‌రావు, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు మంకెన రమేష్, బీఆర్ఎస్ నాయకులు చెవుల ప్రసాద్, కొల్లి వెంకయ్య, పగిళ్లపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ 'గమ్యం'.. ప్రయాణం సులభం



మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ

కల్లూరు: టీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ గమ్యం యాప్‌ను ప్రవేశపెట్టిందని సత్తుపల్లి డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ అన్నారు. ఆదివారం కల్లూరు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గమ్యం యాప్‌తో ప్రయాణికులకు బస్సు ఎక్కడ ఉందో ముందే తెలుసుకొని సమయానికి చేరుకోవచ్చని తెలిపారు. అంతే కాకుండా మహిళల భద్రతకోసం ఫ్లాగ్ ఏ బస్సు ఆప్షన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ పౌర్ణమికి సత్తుపల్లి డిపో నుంచి అరుణాచల గిరి ప్రదర్శణ కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని, రిజర్వేషన్ కొరకు 99599 సర్వీస్ నంబర్‌ను ఉపయోగించుకోవాలని, ఇందుకు గాను రూ.3330 చార్జీ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు వీబీఓ కిన్నెర ఆనందరావు, సిబ్బంది వై నరసింహారావు, ట్రాఫిక్ గైడ్ వెంకటేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు సర్వాయి పాపన్న గౌడ్



సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కల్లూరురూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అందరికి ఆదర్శ ప్రాయుడని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండిలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ సేవలను కొనియాడారు. పాపన్న గౌడ్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బండి శ్రీనివాస్ గౌడ్, చెన్నారావు, కృష్ణ, మురళి, నాగయ్య, సైదులు, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, అభిలాష్, వెంకటేశ్వరావు, కాటేపల్లి కిరణ్, శ్రీనివాసరావు, లోకేష్, గోపాల్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

మాధవరెడ్డికి పొంగులేటి నివాళి..

మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మామ కనమతరెడ్డి మాధవరెడ్డి మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో ఆయన భౌతికకాయానికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనమెత్తిన మహిళలు



ముదిగొండ: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ముదిగొండ: మండలంలోని ఎస్సీ కాలనీలో, న్యూలక్ష్మీపురం గ్రామాల్లోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా ముత్యాలమ్మ తల్లి ఆలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జమలాపురంలో..

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని ముత్యాలమ్మతల్లికి ఆదివారం గ్రామస్తులు సమష్టిగా బోనాలు సమర్పించారు. మహిళలు సాంప్రాదాయబద్ధంగా బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి జలబిందెలతో బ్రొడాయికి, ముత్యాలమ్మ తల్లికి జలాభిషేకం చేశారు. ఇంటింటా పరవన్నం తయారు చేసుకుని బోనం ఎత్తుకుని అమ్మవారి వద్దకు చేరుకుని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు రాజీవ్ గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీలల్లో రోగులకు పండ్లు, స్వీట్లు అందజేసి రాజీవ్ గాంధీ దేశ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి టౌన్: రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కోటూరి మానవతారాయ్



వైరా: రాజీవ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పెనుబల్లిలో..



ఎర్రుపాలెంలో..



చింతకాని: పాతర్లపాడులో..